# వరాన్వేషణ

యల్లాప్రగడ సువర్చలాదేవి

"చూసావుగా వసంత్‌ని... ఏంటి నీ అభిప్రాయం? మీ చెల్లెళ్లకోసం సాగుతున్న నీ వరాన్వేషణ ఇక ముగిసినట్టేనా?'' కూకట్‌పల్లి ట్రాఫిక్ సిగ్నల్‌వద్ద కారాపుతూ అడిగాడు యశస్వి.

"బానే వున్నాడు కానీ మరీ కొంచెం మోటుగా ఉన్నట్టున్నాడు'' సందేహాన్ని వెలిబుచ్చుతున్నట్లు అడిగింది మైథిలి.

"అతనేం మోటుకాదు. పల్లెటూరి నుండి వచ్చినవాడు కాబట్టి కాస్త భోళాగా ఉంటాడు. అతనేం తక్కువవాడు కాదు. ఐదేళ్లకు పైగా ఐటి ఇండస్ట్రీలో ఉన్నాడు. దాదాపు యాభైవేల జీతం. మొన్నీమధ్య అమెరికాలో రెండు సంవత్సరాలు ఉండటానికి అవకాశం వచ్చినా వెళ్లలేదతను''

"ఎందుకని?'' వెంటనే అడిగింది మైథిలి.

"అతనికి మాతృదేశాన్ని, అయినవాళ్లని వదిలి వెళ్లడం ఇష్టంలేదు'' సిగ్నల్ కోసం చూస్తూ అన్నాడు యశస్వి.

"మరీ పాతకాలం వాడిలా ఉన్నాడే? ఈ రోజుల్లో అమెరికా అవకాశం వస్తే ఎవరైనా వదలుకుంటారా?'' ఆశ్చర్యంతోపాటు కాస్త నిష్ఠూరంగా తొంగి చూసింది ఆమె గొంతులో.

"అదే అతని గొప్పతనం. డబ్బుకోసం అయినవాళ్లని వదులుకోలేని ఉత్తమ గుణం ఉంది అతనిలో. అతను తలుచుకుంటే ఏ కంపెనీలోనైనా జాబ్ వస్తుంది. అంత టాలెంటెడ్ అతను. కానీ అతను చాలామందిలాంటివాడు కాడు. మొన్నీమధ్య అతనికి ఒక మంచి కంపెనీ నుండి పెద్ద ఆఫర్ వచ్చింది. ఇప్పటి జీతం కన్నా కూడా చాలా ఎక్కువే అయినా ప్రస్తుతం చేస్తున్న మా కంపెనీలో చేసింది తక్కువ కాలమే అని వెళ్లలేదు. తరచూ ఉద్యోగాలు మారడం మంచిదికాదని అతని అభిప్రాయం'' చెప్పుకొచ్చాడు యశస్వి.

వసంత్, యశస్వి చేసే కంపెనీలోనే చేస్తున్నాడు. యశస్వి కన్నా జూనియర్. యశస్వికి వసంత్‌మీద చాలా మంచి అభిప్రాయమే వుంది. అలాంటి అబ్బాయిని ఏ అమ్మాయి చేసుకున్నా ఆమె అదృష్టవంతురాలు అవుతుందనేది అతని నిశ్చితాభిప్రాయం.

అదే విషయాన్ని ఓసారి తన భార్య మైథిలితో అన్నాడు.

దాని పర్యవసానమే ఆ రోజు మైథిలి కజిన్ సిస్టర్స్‌లో ఎవరో ఒకరిని అతనికిద్దాం అనే ఆలోచనలో దంపతులిద్దరూ వసంత్ వాళ్ల ఇంటికెళ్లి తిరిగొస్తున్నారు.

గ్రీన్ సిగ్నల్ పడడంతో కారును ముందుకు పోనిచ్చాడు యశస్వి. శనివారం సాయంత్రం అయినా ట్రాఫిక్ బానే వుంది.

"అబ్బాయి ఫర్లేదు కానీ అంతా అక్కడ కూర్చుని ఉంటే కాళ్లు పైన పెట్టుకుని గోడకి ఆనుకుని దీవాన్ మీద కూర్చున్నాడు. కాస్త డిగ్నిఫైడ్‌గా ఉండొచ్చు కదా. ఆ అబ్బాయిని చూస్తే అంత పెద్ద ఉద్యోగస్తుడని ఎవరూ అనుకోరు'' తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వెలిబుచ్చింది మైథిలి.

"గొప్పగొప్ప వాళ్లంతా సింపుల్‌గానే వుంటారు. గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి, టంగుటూరి ప్రకాశం పంతులు... ఇలా ఎంత మంది గురించి వినలేదు.''

"మీరు మరీ చెపున్నారు అతని గురించి'' భర్త మాటలకు అడ్డొస్తూ అంది మైథిలి.

"ఓకే... మరీ అంత కాదనుకో. కానీ ఈ కాలం వాళ్లతో పోలిస్తే అతను చాలా సింపుల్‌గా ఉంటాడు. చూసావుగా అతని బెడ్రూం. మంచం కూడా లేదు. కిందే పరుపు మీద పడుకుంటున్నాడు. ఇంట్లో కూడా పెద్ద ఖరీదైన సామానులేవీ కనిపించలేదు. దేవుడి మందిరం, ఇంట్లో చాలాచోట్ల దేవుడి ఫోటోలు ఉన్నాయి. దైవభక్తి బాగానే వుంది. హాల్లో కూడా ఓ దీవాను, నాలుగు ప్లాస్టిక్ కుర్చీలు. నాకు తెలిసి ఆ ఇంట్లో ఖరీదైనవి టీవీ, ల్యాప్‌టాప్ అనుకుంటా'' సాలోచనగా అన్నాడు.

"బావుంది. చిన్నప్పుడు ఓ గదిలో కొన్ని వస్తువులను పెట్టి బయటకు వచ్చి చూసిన వస్తువులను రాయమనే ఓ ఆట వుంటుంది. ఎవరు ఎక్కువ పేర్లను గుర్తించుకుని రాస్తే వారు గెలిచినట్లు. బహుశా ఆ ఆటలో మీరే ఎక్కువగా గెలుస్తుండేవారేమో'' ఆట పట్టిస్తూ అంది మైథిలి.

"జోక్స్ కాదు. నేను అతని సింప్లిసిటీ గురించి చెబుతున్నాను. అలాగని అతనేం పెద్ద లేనివాడు కూడా కాదు. అతనికి వాళ్ల ఊళ్లో, ఆ చుట్టుపక్కల ఓ పది స్థలాలు, ఓ రెండు డాబా ఇళ్లున్నాయి. మొత్తం నాలుగు పోర్షన్‌లు. రెండు వీళ్లు ఉంచుకున్నారు. రెండు అద్దెలకిచ్చారు. హైదరాబాద్‌లో కూడా కూకట్‌పల్లి మెయిన్‌రోడ్ దగ్గర్లో ఓ ఫ్లాట్ ఇప్పుడు ఈ మియాపూర్ దగ్గర మరో ఫ్లాట్.''

అతని ఆస్తి వివరాలు వింటూ ఆశ్చర్యపోయింది మైథిలి.

"చూడు మైథిలీ! ఏ ఆడపిల్లకైనా కావాల్సింది భర్త ఆర్థికంగా సెటిల్ అయి ఉండడం, మంచి ఉద్యోగం, మంచి గుణగుణాలు, ఎలాంటి చెడు అలవాట్లు లేకుండా ఉండడం. ఇంతకన్నా ఏం కావాలి?'' కారు సనత్‌నగర్ బ్రిడ్జి మీద నుండి వేగంగా ముందుకు దూసుకెళుతోంది.

"అవన్నీ సరే... మీరు గమనించారో లేదో అతని మాటలనుబట్టీ నాకర్థమయింది ఏమిటంటే అతనికి సినిమాలంటే పెద్ద ఇష్టంలేదు.

టీవీలో కూడా క్రికెట్ తప్ప ఏం చూడడట. ఇంట్లో వస్తువులు, బట్టలు ఇవన్నీ చూస్తే మరీ పాతకాలం నాటివాడులాగా అనిపిస్తున్నాడు. ఈ రోజుల్లో ఏ ఆడపిల్ల మాత్రం అంత పాతకాలంలా ఆలోచిస్తుంది? మా పిన్ని కూతుళ్లుగానీ, మా అత్తయ్య కూతుళ్లుగానీ, మీ చెల్లెలుగానీ, పోనీ మీ మామయ్య కూతురుగానీ ఈ రోజుల్లో ఎవరు అలా ఉన్నారు? ఎవరు అలా ఆలోచిస్తున్నారు? ఈ రోజుల్లో అమ్మాయిల ఆలోచనలు మారుతున్నాయి. అమ్మాయిలు ఎవరో ఒకరులే అని చేసుకోవడంలేదు. వారికి భర్త అంటే సంపాదించిపెట్టే యంత్రం కాదు. భర్తంటే ఓ స్నేహితుడు, ఓ ప్రేమికుడు. జీవితం అంటే మరలా రాని ఓ సుందర స్వప్నం. అలాంటి జీవితంలో ప్రతి నిముషాన్ని ఆస్వాదించడానికి తమతో పాటు ఉండే ఓ సహప్రయాణికుడు మాత్రమే కాదు ఇష్టసఖుడు'' ఆవేశంగా చెప్పుకుపోతోంది మైథిలి.

"చూడు మైథిలీ! ప్రతివారికీ నీ భర్తలాంటి వారు దొరకాలంటే ఎలా కుదురుతుంది?'' తను వేసిన జోక్‌కి తనకే వస్తున్న నవ్వును ఆపుకుంటూ అన్నాడు యశస్వి.

క్షణకాలం అర్థం కాకపోయినా తరువాత భర్త అన్నదాంట్లో అర్థమయ్యి వస్తున్న నవ్వును ఆపుకుంటూ "ఆపుతారా మీ డబ్బా'' అంది కోపం నటిస్తూ.

"మురిసిపోయింది చాలు. ముందు చూసి డ్రైవ్ చేయండి'' చిన్నపాటి కోపం నటిస్తూ అంది మైథిలి.

డ్రైవ్ చేస్తూనే మళ్లా టాపిక్‌లోకి వస్తూ అన్నాడు.

"చూడూ... నువ్వు చాలా చిన్న విషయాలను భూతద్దంలో చూస్తున్నావు. జీవితం అంటే టీవీలు, సినిమాలు, షికార్లు కావుకదా. పోనీ అలా సరదాగా తిప్పేవాడే అయితే ఇన్నాళ్లూ ఎలాంటి తిరుగుళ్లు తిరగకుండా భార్య వచ్చే వరకు నోట్లో



వేలేసుకుని వెయిట్ చేస్తుంటాడంటావా? ఈ రోజుల్లో సిగరెట్, తాగుడు, తిరుగుళ్లు ఇలాంటి ఏ మచ్చ లేని వాళ్లు చాలా అరుదు. ఆ వచ్చేవాడు మోడరన్‌గా ఉంటూనే రేపు వచ్చే భార్యని సతాయించేవాడైతే అప్పుడు ఏం చేస్తారు మీ అమ్మాయిలు? లేదా పుట్టింటి నుండి అవీ ఇవీ తీసుకురా అనో, కష్టపడి ఉద్యోగం చేసి డబ్బులు బాగా సంపాదించింది తెచ్చి వాడి చేతిలో పోయమనే వాడో అయితే! మళ్లా అలా ఉద్యోగం కోసం బయటకు వెళ్లొచ్చే భార్యని అనుమాన భూతంతో చూసి సతాయించేవాడైతే...'' రెడ్ సిగ్నల్ పడడంతో కారాపాడు యశస్వి.

"మీరు మరీ అలా దారుణంగా ఊహిస్తున్నారు కానీ ఈ రోజుల్లో కూడా అలా ఉంటారా?'' భర్త మాటలను ఎందుకో పూర్తిగా అంగీకరించలేక అన్నది మైథిలి.

"అలాంటి పరిస్థితులే లేకపోతే ఈ గృహహింస చట్టాలెందుకొస్తాయి?


## ఇవి తినాలి మరి!

ముదురు ఆకుపచ్చ రంగు ఆకుకూరలు, చేపలు, రొయ్యలు, కోడి గుడ్లు, పొద్దు తిరుగుడు గింజల నూనె, వేరుసెనగల ద్వారా విటమిన్ 'ఇ' పుష్కలంగా అందుతుంది. విటమిన్ 'ఇ'వల్ల చర్మం ప్రత్యేక మెరుపును సంతరించుకుంటుంది. వార్ధక్యపు ఛాయలు దరిచేరవు. ఒక్కమాటలో



చెప్పాలంటే వయస్సు ప్రభావం చర్మంపై కనబడకుండా చూసుకోవచ్చు. గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. విటమిన్ ఇ తీసుకోవడంవల్ల కొన్నిర కాల క్యాన్సర్లను నివారించగలం. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేయ డంలో దీని పాత్ర కీలకం. అందుచేత మనం ప్రతిరోజూ తీసుకునే ఆహా రంలో విటమిన్ 'ఇ' తప్పనిసరిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

**-కాలివు శంకరరావు**




పోనీ మనం రోజూ పేపర్‌లలోనూ, టీవీలలోనూ చూసే అమ్మాయిలపై ఈ దాడులు ఎందుకు జరుగుతున్నాయి.''

భర్త మాటలకి ఏం చెప్పాలో అర్థం కాలేదు మైథిలికి. ఒకపక్క ఆయన చెప్పేది నిజమే.

అలానే మరోపక్క రోజురోజుకీ ఆధునికంగా మారుతున్న అమ్మాయిల దృక్పథం కళ్లముందు కనబడుతోంది. తమ అభిరుచులకు అనుగుణంగా అబ్బాయిలు, భర్తలు లేకపోతుంటే వారికి దూరమవుతున్న మగువలను చూస్తున్నదే.

అయితే ఓ స్త్రీగా మగవాళ్లు ఆడవాళ్లను అర్థం చేసుకుంటే ఈ బాధలు ఉండవుకదా అనేదే తన ఆలోచన. ఇంతలో తన కజిన్ లావణ్య గుర్తుకువచ్చింది. వెంటనే అందుకుంది.

"మీకు లావణ్య తెలుసుకదా. ఈమధ్య ఎప్పుడు అది ఫోన్ చేసినా అది సంతోషంగా లేదనేది తెలుస్తూనే వుంది. మీరు చెప్పినట్లు దాని భర్తకి ఏ చెడు అలవాట్లు లేవు, జాగ్రత్తపరుడు. అయితే పెళ్లయి ఇంకా సంవత్సరం కూడా కాకుండానే వాళ్ల మధ్య అపార్థాలు.''

"అసలు ఏంటి సమస్య వాళ్లమధ్య'' ఆమె మాటలకు అడ్డొస్తూ అడిగాడు యశస్వి.

"ఆయన రోజంతా ఆఫీస్‌లోనే ఉంటాడు. పగలంతా ఇది ఒక్కతే ఇంట్లో ఉండీ ఉండీ దీనికి బోర్‌గా ఉంటోందిట. ఆఖరుకి టీవీ అంటే కూడా మొహం మొత్తే పరిస్థితికి వచ్చేసిందిట. సాయంత్రం వచ్చాక ఎక్కడికో ఒక చోటికి తీసుకెళ్లమంటే తాను అలసిపోయి ఉన్నాను అని తీసుకెళ్లడట. అంతే కాదు, దీనికే టైమ్‌ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియదని ఎదురు అంటున్నాడుట. కుట్లు, అల్లికలు, పెయింటింగ్స్ వేయడం లేదా వంటలు నేర్చుకోవడం ఇలా ఏదైనా వ్యాపకం కల్పించుకోవచ్చు కదా అంటున్నాడట. చివరికి ఈమధ్య వచ్చిన దాని అభిమాన హీరో సినిమాకి కూడా పోరగా పోరగా ఎప్పటికో తీసుకెళ్లాడట. అది ఆనందంగా నాకు ఫోన్‌చేసి నా ఆ సినిమా సంగతులు షేర్ చేద్దామనుకుంటే ఇప్పుడు ఆ సంగతులన్నీ మాట్లాడడం అవసరమా అని అంటాడుట. దానికి దాని ఇల్లు ఇల్లులా కాక ఓ జైలులా ఉందిట'' ఇప్పుడేమంటారు? అన్నట్లుగా అడిగింది మైథిలి.

"సాధారణంగా మన మనస్తత్వం ఎలా వుంటుందంటే మనం ఓ బస్సు కోసం వెయిట్ చేస్తున్నాం అనుకో... బస్సు త్వరగా వస్తే బావుండు త్వరగా ఇంటికి వెళ్లవచ్చు అని ఆలోచిస్తాం. బస్సు వచ్చాక రష్‌గా ఉన్నదానిని చూసి ఎలాగోలా లోపలకు ఎక్కితే చాలు కాసేపు కళ్లు మూసుకుంటే ఇంటికి వెళ్లిపోవచ్చు అని అనుకుంటాం. ఇక లోపలికి వెళ్లాక తోసుకునే ఆ జనాన్ని చూసి కాస్త తోసుకోకుండా ఓ పక్కన నిలబడే స్థలం దొరికితే బావుణ్ను అని అనుకుంటాం. ఆ కాస్తా దొరికాక కాస్త సీటు దొరికితే బావుంటుంది కదా అనిపిస్తుంది. పోనీ సీటు దొరికాక అయినా ఆనందంగా వుంటామా అంటే... ఆహా... కిటికీ పక్క సీటైతే బావుంటుంది అని అనుకుంటాం. ఇలా మన కోరికలకు అంతే ఉండదు చెప్పుకుంటూ పోతే. ఇది సాధారణ హ్యూమన్ సైకాలజీ. అదే ఇక్కడ కూడా వర్తిస్తుంది. ముందు మన అమ్మాయికి మంచివాడు, చదువుకున్నవాడు, ఉద్యోగస్థుడు, ఆస్తిపరుడు... ఇలా ఓ చిట్టాతో మొదలుపెడదాము. ఈ లిస్టు ఇలా వెళ్లిపోతూనే వుంటుంది. ఇప్పుడు నువ్వు చెప్పేది కూడా అలాంటి లగ్జరీ కోవలోకే వస్తుంది. అన్నీ బాగున్న అబ్బాయి కూడా మీకు నచ్చకుండా అతని మనస్తత్వం కూడా మీరు కోరుకునే విధంగా ఉండాలనడం అత్యాశ కదా''

అతని మాటలతో ఆలోచనలో పడిపోయిన మైథిలి మెల్లగా తేరుకుని "ఎక్కడున్నాం?'' అంటూ బయటకు చూసింది. "ఖైరతాబాద్ వచ్చేసామే... మాటలలో తెలియకుండా'' అంది.

"ఇల్లు కూడా వచ్చేస్తుంది మరి నువ్వేమైనా తేల్చుకుంటే ఇంటికెళ్ళాక మీ వాళ్ళతో ఫోన్ చేసి ఓ నిర్ణయానికి రావొచ్చు" సలహా ఇచ్చాడు యశస్వి.

"జీవితంలో చాలా చిన్నవిగా కనిపించే ఇలాంటి సంఘటనలే నేడు ఎన్నో జీవితాలలో అల్లకల్లోలాన్ని సృష్టిస్తున్నాయి. అమ్మాయిలు మారాలి ఆధునికత ముసుగులో కొట్టుకుపోకుండా. అలాగే అబ్బాయిలూ అమ్మాయిల మనసెరిగి ప్రవర్తించాలి. ఎంతమంది అబ్బాయిలు పెళ్ళి కాకముందు చూపించే శ్రద్ధలో కనీసం సగం శ్రద్ధ అయినా పెళ్ళయ్యాక తీసుకుంటారు తమ జీవిత భాగస్వాముల గురించి? మరి వారిలో వచ్చే ఈ మార్పు అమ్మాయిలకు అసంతృప్తిని కలిగించదంటారా?" ఆలోచనగా అంది మైథిలి.

"నువ్వు చెప్పేది నిజమే. ఈ విషయంలో మగవాళ్ళు జాగ్రత్తగా ఉండాలి. వాళ్ళకుండే బాధ్యతలను తప్పక నెరవేర్చాలి. భార్యని ఆనందంగా ఉంచడం వారి బాధ్యత. నేను కాదనడంలేదు. అయితే ఒక పక్క ఉద్యోగ బాధ్యతలు, ఆర్థికపరమైన సమస్యలు. వీటన్నిటితో సతమతమయ్యే మగవాడికి భార్య స్వాంతన కావాలేగానీ సమస్య కాకూడదు. ఇద్దరి మధ్యలో సరైన అవగాహన, సర్దుబాటు వుంటే సమస్యలే రావు. మీ లావణ్యను ఒక పని చేయమను. ఆమె భర్త అంత ఓపిక ఉన్నవాడిలా కనబడడంలేదు కనుక తననే కాస్త ఓపిక పట్టమను. వారంలో ఐదురోజులు ఉద్యోగం చేసి అలసిపోయి వచ్చే అతనికి అండగా ఉండమను. శని, ఆదివారాలలో ఒక్కో వారం సినిమాకో, హోటల్‌కో, షికారుకో, బీచ్‌కో... ఇలా వెళ్ళమను. అదీ ఇద్దరికీ అనుకూలమైన టైములో. ఒక్కసారి అతనిపై వత్తిడి తేకుండా ఆమెని పరిస్థితిని చక్కదిద్దమను. ఇక ఆ తరువాత అతనూ ఆమెను విసుక్కోవడమూ, తగాదాలు పడడం లాంటివి ఉండకపోవచ్చు. ఎటూ అతను స్వతహాగా మంచివాడేకదా" అన్నాడు ఆ సమస్యకి ఓ పరిష్కారాన్ని చూపించాలని ప్రయత్నిస్తూ.

"అవును. దానికి నేను చెప్పి చూస్తా" అంది భర్తతో ఏకీభవిస్తూ మైథిలి.

"ఇంకా ఆ అమ్మాయికి ఇంట్లో బోరు కొడుతూ ఉంది అనుకుంటే ఎక్కడైనా సరదాగా పార్ట్‌టైంగానీ, ఫుల్‌టైంగానీ ఏదైనా జాబ్‌లో చేరమను"

"గుడ్ ఐడియా... థాంక్యూ" అంది భర్తని అభినందిస్తూ.

"మరి... వసంత్ సంగతి ఏం చేసావ్? మీ కజిన్‌లలో ఎవరికైనా ఓకేనా" అడిగాడు.

"అదే ఆలోచిస్తున్నాను. మనం ఎంత అనుకున్నా ఈ కాలం అమ్మాయిలు ఇంత సింపుల్‌గా ఉండే అబ్బాయితో అడ్జస్ట్ అవగలరంటారా?" సందేహంగా అంది మైథిలి.

"మనం ఎన్ని చూసి చేసినా కొన్ని మన ఆలోచనల పరిధికి అందనివి ఉంటాయి. మనం చేయగలిగినదల్లా కనీసం ఉండాల్సిన గుణగణాలు చూడడమే. వాటన్నింటిలో ఏ ఢోకా లేదు. నేను హామీ. ఇక అతని మనస్తత్వం అంటావా... అతనితో ఇన్నాళ్ళుగా పని చేస్తున్నాను. ఎప్పుడూ మా ఇద్దరి మధ్యలో ఎలాంటి పొరపొచ్చాలు రాలేదు. ఇక వ్యక్తిగతంగా ఆలోచిస్తే అతని అభిప్రాయాలు ఇప్పుడు చూసేవారికి కొన్ని మోటుగా, కొన్ని పల్లెటూరి మనస్తత్వంలాగా కనిపించినా దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా అవే మంచివి.

ఇక భార్యను సంతోష పెట్టడం అంటావా... ఆ విషయంలో కాస్త అతను మారాలి. కాస్త సరదాగా ఉండాలి. ఆ విషయంలో నేను చెప్పాల్సింది, చేయాల్సింది నేను చేస్తాను. ఓకేనా? ఇక నువ్వు చేయాల్సిందల్లా మీ కజిన్లలో ఎవరి మనస్తత్వం అయితే ఇతనికి దగ్గరగా ఉంటుందో అలాంటివారిని వెతకడమే. వాళ్ళిద్దరికి ఇష్టమైతేనే చేసుకుంటారు. ఇందులో మన ప్రమేయం కానీ, బలవంతం కానీ ఏమీ వుండవు. ఓకేనా?" అన్నాడు భార్యను సముదాయిస్తున్నట్లు.


భర్త మాటలతో మనసు కాస్త ప్రశాంతమైన మైథిలి భర్త వంక చూస్తూ "మా ఆయన బంగారం" అంది మురిపెంగా.

"మరి అదే. ప్రతివాళ్ళకీ మీ ఆయనంత బంగారం దొరకడు కదా" అన్నాడు భార్యను సరదాగా ఉడికిస్తూ.

"మళ్ళా మొదలెట్టారా మీ స్వడబ్బా..." చిరుకోపాన్ని ప్రదర్శించబోయిన భార్య నోటికి చేతిని అడ్డుపెడుతూ-

"మొదలెట్టలేదు, ముగించాను. అటు సమస్యా తీరిపోయింది. ఇటు ఇల్లూ వచ్చేసింది. ఇక దిగుదామా" అంటూ అశోక్‌నగర్‌లోని తమ అపార్ట్‌మెంట్ కారు పార్కింగ్‌లో కారును పార్కు చేసి ఇంటివైపు అడుగులు వేసాడు భార్య అడుగులో అడుగు కలుపుతూ యశస్వి.

☆



## అమీషా వంటలు!

అమీషా పటేల్ ఓహ్...సారీ ఓన్లీ 'అమీషా' (ఎందుకంటే ఈమధ్య తన పేరులోంచి పటేల్‌ని తీసేసింది కదా) కనవ్‌పురి అనే ఓ బిజినెస్ మాన్‌తో సన్నిహితంగా వుంటూ నలుగురినీ ఆకట్టుకోవడానికి తెగ ప్రయత్నం చేస్తోంది. ఏమాత్రం ఖాళీగా వున్నా స్వయంగా రకరకాల వంటలు చేసేసి తన బాయ్‌ఫ్రెండ్‌కి వడ్డిస్తోందిట. ముఖ్యంగా నాన్‌వెజ్ రకాలు ఎన్నెన్నో చేసి కనవ్‌కి కొసరి కొసరి వడ్డిస్తోంది. ఈ సంగతి ఆమెనే స్వయంగా చెప్పుకుంటోంది గొప్పగా. ఇదో రకం పబ్లిసిటీయా?

